తేది: 01.01.2003, సాయికుల్వంత్ సభామండపం

# ఏకాత్మ భావంతో చేసే సేవయే నిజమైన సేవ

**చదువులన్ని చదివి చాల వివేకియై**
**పేరు పొందగవచ్చు ప్రకృతియందు**
**రాజరాజై పుట్టి రాజ్యమేలగవచ్చు**
**హేమభూదానముల్ ఈయవచ్చు**
**గగనంపు చుక్కలు గణియింపగా వచ్చు**
**జీవరాసుల పేర్లు చెప్పవచ్చు**
**అష్టాంగవిద్యల నన్ని నేర్వగవచ్చు**
**చంద్రమండల యాత్ర సలుపవచ్చు**
**కాని దేహేంద్రియాదుల నరికట్టి**
**మనసు నిల్పియు నంతర్ముఖమ్ము చేసి**
**అనవరత నిశ్చలమైన ఆత్ములగుచు**
**నిలువగలరా మానవుల్ నియతితోడ?**

*ప్రేమస్వరూపులారా!*

మాటలచేత సిరిసంపదలను, బంధుమిత్రులను సంపాదించవచ్చు. మాటలచేత రాజ్యములనుకూడా సాధించవచ్చు. ఒక్కొక్కసారి మాటలచేత మరణముకూడా సంభవించవచ్చు. ఇంతటి మహత్తరమైన శక్తి కల్గిన మాటలను మానవుడు సక్రమమైన మార్గంలో ప్రవేశపెట్టలేకపోతున్నాడు. మానవునియందున్న మహత్తరమైన శక్తి, గొప్ప కీర్తి,

srisathyasaivachanamrutam

పవిత్రమైన శాంతి మరి ఏ ఇతర జీవియందూ కానరావు. సత్, చిత్, ఆనందములే మానవునియొక్క ప్రధానమైన గుణములు. రూపనామములు అనిత్యములు, అశాశ్వతములు. కాని, మానవుడు ప్రకృతిమాయచేత కప్పబడి, రూపనామములనే లక్ష్యము నందుంచుకొని, అవియే నిత్యసత్యములని భావించి జీవితాన్ని వ్యర్థం గావించుకుంటున్నాడు.

**సైంటిస్టులు - వేదాంతులు**

ఈ లోకములో మేధాశక్తి కల్గినవారు సైంటిస్టులు, వేదాంతులు అని రెండు విధములుగా ఉన్నారు. కేవలం ప్రాకృతమైన వస్తువులను గుర్తించి, వాటి మంచిచెడ్డలను విచారించి వాటిని వినియోగించుకునేవారు కొందరు. ఇలాంటి వారే సైంటిస్టులు. చెట్టుయొక్క కొమ్మలు, రెమ్మలు, చిగుళ్ళను మాత్రమే పరికించి ఆనందించేవారు సైంటిస్టులు. ఆ కొమ్మలు, రెమ్మలకు మూలాధారమైన వేర్లను గుర్తించి, వాటియొక్క శక్తి సామర్థ్యములను పరికించి ఆనందించేవారు వేదాంతులు. కేవలం బాహ్యామైన వృక్షమును చూసి ఆనందించే వ్యక్తులు ప్రాకృతమైన జీవులు. దానికి మూలాధారమైన వేర్లను పోషించి, ఫలములు భుజించి ఆనందించేవారు వేదాంతులు. సైంటిస్టులకు, వేదాంతులకు ఎంతటి వ్యత్యాసమున్నదో చూడండి. ఒక పిడికెడు ఇసుకను తెచ్చి ఒక ప్లేటులో వేసినప్పుడు దాని రంగు, బరువు, స్థితిని బట్టి అది ఫలాని కాలము, ఫలాని ప్రదేశములోని ఇసుక అని సైంటిస్టు లంటారు. కాని, వేదాంతులు ఈవిధమైన విచారణకు పూనుకోరు. ఇదంతా దైవసృష్టి, దైవమాయ అని భావిస్తారు. సైన్సును ఒక అర్ధవృత్తముతో పోల్చవచ్చును. అది ఒకచోట ప్రారంభమై మరొకచోట నిలిచిపోతుంది. కాని, ఆధ్యాత్మికము పూర్ణవృత్తమువంటిది. అది ఎక్కడ పుట్టిందో అక్కడే అంత్యమౌతుంది.

**పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే**

ఇట్టి పూర్ణత్వమైన దివ్యత్వము ప్రతి మానవునియందున్నది. కాని, మానవుడు గుర్తించుకోవడానికి ప్రయత్నించడం లేదు. తాను కన్నులు మూసుకొని నిద్రించే సమయంలో తన దేహాన్ని ఎవరు కాపాడుతున్నారు? తన దేహము ఏరీతిగా పని చేస్తున్నది?

srisathyasaivachanamrutam

ఎవ్వరికీ తెలియదు. సృష్టి, స్థితి, లయములకు దైవమే మూలకారణం. ఈ దివ్యశక్తి ప్రతి మానవునియందున్నది. కాని, ఈ సత్యాన్ని గుర్తించుకోలేక మానవుడు కష్టము వస్తే క్రుంగిపోతున్నాడు, సుఖము వస్తే పొంగిపోతున్నాడు. పొంగని, క్రుంగని సమచిత్తమును సాధించడమే మానవుని ప్రధానమైన లక్ష్యము.

**కష్టనష్టములకు వెఱువక ముందంజ వేయాలి**

అలనాడు దేవతలు, దానవులు అమృత భాండముకోసం మందర పర్వతమును కవ్వముగా చేసుకొని క్షీరసాగరమును మథించగా మొట్టమొదట హాలాహలము పుట్టింది. రాక్షసులు నిరాశానిస్పృహలకు లోనయ్యారు. కాని, దేవతలు ఏమాత్రం వెనుకంజ వేయక, ధైర్యసాహసములతో దానిని తట్టుకొని, నెట్టుకొని తమ ప్రయత్నమును కొనసాగించారు. తత్ఫలితంగా లక్ష్మీదేవి, కామధేనువు, కల్పతరువులనే అమూల్యమైన ఆస్తిని సంపాదించుకోవడమేగాక అమృతభాండమునుకూడా పొందగల్గారు. అదేరీతిగా, మానవుడు ప్రకృతి మాయల చేతజిక్కిన మనస్సును మథించి తన నిజస్వరూపాన్ని గుర్తించడానికి ప్రయత్నించాలి. ప్రప్రథమంలో అడ్డుతగిలే కష్టములు, నష్టములు, విచారములనే 'విషము'ను ఏమాత్రం లెక్కచేయక, వాటికి వెఱువక ముందంజ వేయాలి. అప్పుడే తన నిజస్వరూపాన్ని గుర్తించి వర్తించడానికి వీలౌతుంది.

**మానవత్వంలోని దివ్యత్వమును గుర్తించండి**

ప్రాచీన భారతీయ సంస్కృతి దివ్యమైనది, అమూల్యమైనది, అద్భుతమైనది, ఆనందమయమైనది మరియు ఆహ్లాదకరమైనది. కాని, దీనిని మీరు అలక్ష్యం చేస్తున్నారు. మానవత్వములో ఉన్న దివ్యత్వాన్ని గుర్తించుటకు ప్రయత్నించండి. ఈ ప్రపంచమంతా ఒక ఇల్లువంటిది. మానవులందరూ సోదర సోదరీమణులే! ఈవిధమైన విశ్వాసముతో కాలము గడిపినప్పుడు మనకు ఎంతటి ఆనందము లభిస్తుందో చెప్పడానికి వీలుకాదు. ప్రతి మానవునియందు సత్, చిత్, ఆనందములు ప్రకాశిస్తూనే ఉన్నవి. కాని, మానవుడు తనలో ఉన్న విలువైన గుణములను విస్మరించి అశాశ్వతములైన దేహసంబంధాలను అభివృద్ధి పరచుకొని, అల్పమైన విషయములకు లొంగిపోయి, కాలమును వ్యర్థం చేస్తున్నాడు. తన

sri sathyasai vachanamrutam

దివ్యత్వమును గుర్తించినప్పుడు మానవుడు ఎంతటి ఘన కార్యమునైనా సాధించగలడు. మానవునియందున్న మహత్తరమైన శక్తులు ప్రపంచంలో ఎక్కడా కానరావు. ఇట్టి పవిత్రమైన మానవత్వమును మీరు అల్పబుద్ధితో చూస్తున్నారు. మానవుడు దైవాంశస్వరూపుడు. కనుకనే, కృష్ణుడు భగవద్గీతలో – "మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః" అన్నాడు. ఇదే సత్యాన్ని అంతర్వాణికూడా బోధిస్తున్నది. కాని, మానవుడు తన అంతర్వాణిని ఆలకించుటకు ఏమాత్రము ప్రయత్నించుట లేదు. కేవలం భౌతికమైన, ప్రాకృతమైన పదార్థములనే ఆశిస్తున్నాడు. వాటిద్వారా తనకు ఆనందము లభిస్తుందని భ్రమిస్తున్నాడు. నీటి బుడగలవంటి రూపనామముల మాయలో పడి మాణిక్యమువంటి దివ్యత్వమును దూరం గావించుకుంటున్నాడు. మానవుని యందున్న గొప్ప విలువ నిత్యసత్యమైన గుణములయొక్క తత్త్వమేగాని, రూప నామములు కాదు.

**'కాన్షియన్స్' - 'కాన్షియస్‌నెస్'**

మానవుడు అనేకవిధములైన రోగములచేత పీడింపబడుతున్నాడు. కొన్ని బాహ్యమైనవి, కొన్ని అంతర్ సంబంధమైనవి. బాహ్యమైన రోగము వైద్యుడు ఇచ్చే మందులచేత నివారణ అవుతుంది. అంతర్ సంబంధమైన రోగాలకు ఆత్మభావమే దివ్యౌషధం. కనుక, మీరు ఆత్మతత్త్వమును గుర్తించుకొనుటకు కృషి చేయాలి. ఆత్మ అనగా బ్రహ్మమే. బ్రహ్మమనగా ప్రతి మానవునియందున్న చైతన్యమే. సర్వత్రా వ్యాపించిన చైతన్యమును 'కాన్షియస్‌నెస్' (Consciousness) అన్నారు. మానవదేహములో ఉన్న చైతన్యమును 'కాన్షియన్స్' (Conscience) అన్నారు. అనేకత్వములోని ఏకత్వమును గుర్తించినప్పుడు 'కాన్షియన్స్' అనేది 'కాన్షియస్‌నెస్'గా మారిపోతుంది. ఇదియే చైతన్యముయొక్క అంతరార్థము. ఇట్టి పవిత్రమైన శక్తిని మానవుడు తన హస్తమునందే ఉంచుకొని, అనేకవిధములైన భ్రమలతో ఉఊగుతలూగుతున్నాడు. సత్యము, మంచితనము – ఈ రెండే ఎల్లప్పుడు మానవునివెంట నిలిచేవి. వీటికి విలువ కట్టడానికి వీలుకాదు. కాబట్టి, మానవుడు సత్యమును అనుసరించాలి, మంచితనమును పోషించుకోవాలి. అనిత్యమైన పేరుప్రతిష్ఠల నిమిత్తం ప్రాకులాడకూడదు. ఇప్పుడు తెలుగు గంగ నీరు మనం చెన్నైకి ఇస్తున్నామని భ్రమిస్తున్నారు. కాని, గంగ ఒకరు ఇచ్చేది కాదు. ఇది ప్రకృతియొక్క వరప్రసాదము. ఎవరి

srisathyasaivaahinamrutam

ప్రాప్తికి తగినట్లు వారికి లభిస్తుంది. కాల, కర్మ, కారణ, కర్తవ్యములు కలసిరావాలి. అప్పుడే కర్మ ఫలిస్తుంది. అందునిమిత్తం మనం కాచుకొని ఉండాలి. సమయమునకు తగినట్లుగా దీనిని కాపాడుకోవాలి.

పిల్లలందరూ (శ్రీ సత్యసాయి విద్యాసంస్థల పూర్వవిద్యార్థులు) ఎన్నో సత్కర్మలు చేస్తున్నారు. అనేక పల్లెలకు వెళ్ళి సేవలు, సంకీర్తనలు చేసి వారికి ఆనందాన్ని అందిస్తున్నారు. ఐతే, ముఖ్యంగా మనస్సులో ప్రేమను ఇముడ్చుకొని జీవితమును సాగిస్తూ పోవాలి. మనం చేసే పరోపకారము, భజనలు ప్రధానం కాదు. "నేను పరులకు సేవ చేస్తున్నాను" అనే భావము మనస్సులో లేకుండా చూసుకోవాలి. "నా నిమిత్తం నేను చేస్తున్నాను" అనే భావమును కల్గియుండాలి. పరులు పరులు కారు, పరమాత్మ స్వరూపులు. కనుక, ఎవరికి సేవ చేసినా అది పరమాత్మ సేవగానే భావించాలి. ఇట్టి భావము రావడానికే మనం ఇన్ని రకములైన సత్కర్మలు చేస్తున్నాము. ఇట్టి స్వార్థరహితమైన ప్రేమతో చేసే సేవలే నిజమైన సేవలు. The best way to love God is to love all and serve all. ప్రేమచేతనే మనం ఈ పనులు చేయాలి. అప్పుడే అది నిజమైన సేవగా రూపొందుతుంది. ప్రేమ అనే 'పాజిటివ్' లేకుండా ఎంత సేవ చేసినా అదంతా 'నెగెటివ్'గానే మారిపోతుంది. ప్రేమ అనే కరెంటు లేకపోతే సేవలనే బల్బులు ఎన్ని పెట్టినా అవి ప్రకాశించవు. 'మెయిన్ స్విచ్'ని వేసినప్పుడే 'బల్బులు' ప్రకాశిస్తాయి. హృదయమే 'మెయిన్ స్విచ్'. హృదయమునుండి ఆవిర్భవించే ప్రతి కార్యము ప్రేమమయంగా రూపొందాలి.

**భగవంతుడు అప్రమేయుడు**

దైవత్వముయొక్క చరిత్ర ఇట్టిది, అట్టిది అని ఎవ్వరూ నిర్ణయించలేరు. దైవసృష్టి అత్యంత అద్భుతమైనది. కాంతితరంగములు క్షణములో ఎన్నో వేలమైళ్ళ దూరం ప్రయాణిస్తాయి. అయితే, ఆకాశమునందున్న కొన్ని నక్షత్రముల కాంతి ఈనాటికీ భూమిని చేరుకోలేదు. అనగా, ఆ నక్షత్రములు భూమికి అంతదూరంలో ఉన్నాయన్న మాట! సృష్టియే ఇంత అద్భుతంగా ఉంటే సృష్టికర్తయైన భగవంతుని తత్త్వమును ఎవరు అర్థము చేసుకోగలరు?

srisathyasaivachanamrutam

**చిత్రంబులు త్రైలోక్య ప**
**విత్రంబులు భవలతాలవిత్రంబులు స**
**న్మిత్రంబులు మునిజనవన**
**చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్**

ఈ లోకంలో ప్రత్యక్షప్రమాణము, అనుమాన ప్రమాణము, ద్వైతప్రమాణము, అద్వైతప్రమాణము మొదలైనవెన్నో ఉన్నాయి. ఉదాహరణకు, ఒక కొండపైన అగ్ని కనిపించిందనుకోండి. అది ప్రత్యక్షప్రమాణము. అగ్ని కనిపించక కేవలం పొగ మాత్రమే కనిపిస్తే, ఆ పొగను చూసి అక్కడ అగ్ని ఉండవచ్చునని భావిస్తాము. ఇది అనుమాన ప్రమాణము. అయితే, అగ్ని లేకపోయినా మంచు వలనకూడా పొగ రావచ్చును. కనుక, అనుమాన ప్రమాణము మనల్ని సందిగ్ధావస్థకు గురిచేస్తుంది. భగవంతుడు ఎట్టి ప్రమాణములకూ అందనివాడు కనుక, అతనిని అప్రమేయుడని పిలిచారు. భగవంతునికి హిరణ్యగర్భుడు అని మరొక పేరు. హిరణ్యమనగా బంగారము. అది తన హృదయమునందున్నది. ఉదరములోకి పోయిన ఆహారము జీర్ణమై దాని సారము దేహంలోని సర్వాంగములలో ఏవిధంగా ప్రసరిస్తుందో అదేవిధంగా, ఈ హిరణ్యము తన దేహమంతా సంచరించడంచేత భగవంతుడు మహా సౌందర్యవంతునిగా ఉన్నాడు. ప్రతి జీవికి భగవంతుడే మూలాధారమైన శక్తి. తన సంకల్పముచే సర్వజీవులను సృష్టిస్తున్నాడు. భగవంతునికి దక్షిణామూర్తి అనికూడా పేరు. దక్షిణామూర్తి అనగా మంచి తెలివైనవాడు, పవిత్రమైన సంకల్పములు కల్గినవాడు. ఈరీతిగా చెప్పుకుంటూ పోతే, భగవంతునికి అనంతమైన పేర్లున్నాయి. "నిర్గుణం నిరంజనం సనాతనం నికేతనం నిత్య శుద్ధ బుద్ధ ముక్త నిర్మల స్వరూపిణం" ఇట్టి తత్త్వము కల్గిన భగవంతుడు తన హృదయమునందే ఉండగా మానవుడెందుకు అల్పుడౌతాడు? ఈ అల్పబుద్ధిని మొట్టమొదట మనం త్రోసివేయాలి. మానవుని కంటే గొప్పవాడు మరొకడు లేడు. మానవత్వమునందే దైవత్వము ఇమిడి యున్నది. ఎక్కడున్నాడు భగవంతుడు? మానవునియందున్న ప్రేమయే భగవత్స్వరూపము. సత్యమే భగవత్స్వరూపము. సత్యప్రమాణమే నిజమైన ప్రమాణము. దేశములు వేరువేరుగా ఉండవచ్చును. కాని, సత్యము ఒక్కటే కదా! ఇది అమెరికన్ సత్యము, ఇది జపనీస్

srisathyasaivachanamrutam

సత్యము, ఇది ఇండియన్ సత్యము అని విభాగము చేయడం అల్పబుద్ధుల లక్షణం. మనం అల్పులం కాదు, అనంత స్వరూపులం. సత్యమే మన స్వరూపము. ప్రేమయే మన స్వభావము. ఆనందము మన సహజ లక్షణము. దీనిని బట్టి మనం విచారణ చేయాలి.

**భగవంతునితో చేరికయే ఆనందము**

ప్రేమస్వరూపులారా! ఆనందముకోసం మనం ఎక్కడో వెతుకనక్కర్లేదు. ఆనందము మన ఇంటనే, వెంటనే, జంటనే, కంటనే ఉంటున్నది. మీరు నమ్ముతారో నమ్మరోగాని నేనెప్పుడూ ఆనందంగానే ఉంటాను. అట్టి ఆనందాన్ని మీరుకూడా అనుభవించండి. మన హృదయమే ఆనందమయము. Happiness is union with God. దైవముతో చేరినప్పుడే ఆనందము ప్రాప్తిస్తుంది. కనుక, మీరు దైవముతో చేరండి. అప్పుడు ఆనందము మీ బానిసవలె మిమ్మల్ని అనుసరిస్తుంది. మీరు ఆనందానికి బానిసలు కాకూడదు. ఆనందమే మీకు బానిస కావాలి. అప్పుడే మీరు నిజమైన మానవులవుతారు. మీరు గొప్ప వీరులు, ధీరులు, గంభీరులు. కనుక, ఆనందము మిమ్మల్ని అనుసరిస్తూ రావాలిగాని, మీరు ఆనందముకోసం వెతుకుతూ పోనక్కర్లేదు. ఈవిషయంలో హనుమంతుణ్ణి మీరు ఆదర్శంగా తీసుకోవాలి. అతనికి రామచింతన తప్ప అన్య చింతలు లేవు. కనుకనే, 'శాంతుడు, గుణవంతుడు, బలవంతుడు హనుమంతుడు' అని పేరొందాడు. మీరుకూడా అలాంటి తత్త్వమును సంపాదించుకోవాలి. ప్రేమస్వరూపులారా! మీరు ఎన్ని చదువులో చదువుతున్నారు, ఎన్ని గ్రంథములో పఠిస్తున్నారు, ఎన్ని శక్తులనో సంపాదిస్తున్నారు. కాని, ఇవన్నీ అనిత్యమైనవి, అసత్యమైనవి. మీ హృదయానందమును, శక్తిని మీరు గుర్తించుకోండి. దైవత్వముతో చేరి మీ శక్తిని అభివృద్ధి గావించుకోండి. ఆ శక్తి అనంతమైనది. ఎంత పోతున్నా ఇంకా విస్తరిస్తూనే ఉంటుంది. అలాంటి అనంతమైన ఆనందము మీయందే ఉండగా మీరు కష్టములకు గురి కావడమెందుకు?

**ఎవరి గ్రామాన్ని వారు అభివృద్ధిపరచుకోవాలి**

ఇప్పుడు మా 'ఓల్డ్ స్టూడెంట్స్' అనేకమంది వచ్చారు. వీరు ఎన్నో సేవలు చేస్తున్నారు,

sri sathyasai vachanamrutam

భజనలు పాడుతున్నారు. నా ఉద్దేశ్యమేమిటంటే, ఎక్కడివారు అక్కడే ఆనందమును అనుభవించాలి. ఎక్కడినుండో వచ్చినవారిని చేర్చుకోవడంవలన ఇదొక వ్యాపారరంగముగా మారుతున్నది. అది మంచిది కాదు. ఏ గ్రామము వారు ఆ గ్రామములోనే జీవితాన్ని గడుపుకోవాలి. ఆ గ్రామమునకు ఆనందమును అందించాలి. పూర్వం కొందరు భక్తులు, "స్వామీ! మైసూరుకు రండి, అక్కడ మీకొక 'ప్యాలెస్' ఇస్తాము" అన్ని నన్ను ఎన్నో రకములుగా ప్రార్థించారు. కాని, నాకీ ప్యాలెస్‌లు అక్కర్లేదు. ఈ చిన్నపల్లెలోనే నేనుండాలి. పుట్టిన స్థానమును నేను వదలలేదు. ఇలాంటిచోటే పెద్ద కార్యములను సాధించాలి. ఆ రోజుల్లో పుట్టపర్తి చాలా కుగ్రామము. ఇక్కడికి రావాలంటే పెనుకొండనుండి ఎడ్లబండిను బాడుగకు తీసుకోవలసివచ్చేది. కాని, ఇప్పుడు ఏరోప్లేనే వచ్చి దిగి పోతున్నది. ఆసుపత్రికి వెళ్ళాలంటే ఆ రోజుల్లో అనంతపురం వెళ్ళవలసివచ్చేది. ఇప్పుడు ఇక్కడే ఒక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ తయారైంది. ఈవిధంగా పట్టణాల్లో ఏమి ఉంటాయో అవన్నీ ఇక్కడికే వచ్చేస్తున్నాయి.

దేశానికి పల్లెలే ప్రధానమైనవి. పల్లెసేవయే పరమాత్మసేవ. పట్టణసేవలో ఏమాత్రము ఆనందముండదు. పట్టణవాసులు ప్రక్కింటిలో దొంగలు పడినా పట్టించుకోరు. కాని, పల్లెప్రజలు అలాంటి స్వార్థజీవులు కారు. పల్లెలో ఎవరికి ఏ కష్టము కలిగినా అందరూ అక్కడ ప్రోగవుతారు. ఇలాంటి ఐకమత్యము పల్లెలయందే ఉన్నది. 'యూనిటీ' ఉన్నప్పుడే 'డివినిటీ' వస్తుంది. 'డివినిటీ' ఉన్నప్పుడే ఆనందము లభిస్తుంది. కనుక, 'యూనిటీ'ని అభివృద్ధిపరచుకోండి. ఏఏ గ్రామాలవారు ఆయా గ్రామాలయొక్క అభివృద్ధికై పాటుపడండి. వీరు, వారు, అందరినీ చేర్చుకొని politics మాదిరి తయారు చేయకండి. ఇది నాకంత సంతోషంగా లేదు. ఎక్కడకు వెళ్ళినప్పటికీ ఐకమత్యంగా భజన చేసుకోండి. భేదభావాలు మీలో రాకూడదు. అందరూ ఐకమత్యంగా ఉండాలి. పూర్వం ఈ దేశము ఎంతో శాంతియుతంగా ఉండేది. అలాంటి దేశానికి ఈనాడు ఏ గతి పట్టింది? పల్లెలలో ఒకరినొకరు ఎంతో ప్రేమగా పలుకరించుకునేవారు. ఇప్పుడా ప్రేమయే లేదు. లేనిపోని కలతలు ప్రారంభమౌతున్నాయి. ముఖ్యంగా స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఎన్నిరకములైన

srisathyasaivecharamrutam

అల్లర్లో ప్రారంభమైనాయి. ప్రాణమంటే వారికి లక్ష్యమే లేదు. తోటి మానవుల ప్రాణాలు తీస్తున్నారు. ఇది మానవులు చేయవలసిన పనియేనా? కాదు, కాదు. ఎవ్వరినీ Kill చేయ కూడదు; మనలో ఉన్న దివ్యశక్తిని Skill చేయాలి. అప్పుడే జీవితంలో Balance చక్కగా కుదురుతుంది. Balance చక్కగా కుదిరినప్పుడే Insight ఏర్పడుతుంది.

ప్రతి గ్రామాన్ని తగినరీతిగా అభివృద్ధి చేయాలి. అందరిలో ఉన్న భేద భావాలను దూరం చేయాలి. గ్రామసేవ నిమిత్తం ఇప్పుడు వచ్చిన పిల్లలు (పూర్వ విద్యార్థులు) హైదరాబాద్, మద్రాసు, అమెరికా, ఇంకా అనేక ఇతర ప్రాంతాల నుండి వచ్చారు. ఎందుకు ఇలా రావడం? ఇదేమైనా ఒక సంతనా? కానే కాదు. హైదరాబాద్‌వారు హైదరాబాద్‌ను అభివృద్ధి చేయండి. హైదరాబాద్ నుండి ఇంకొక పట్టణం పోయి వారిని అభివృద్ధి చేయండి. అంతేగాని, హైదరాబాద్, మద్రాసు... ఈరీతిగా వేర్వేరు ప్రాంతాలవారంతా 'కదంబం' మాదిరి చేరడం వలన అంతా 'కల్తీ'గా మారిపోతున్నది. అది చివరికి Cofusion మరియు Pollution లకు దారితీస్తుంది. 'ప్యూరిటీ' కావాలి మనకు. ఈ 'ప్యూరిటీ' ఎప్పుడు వస్తుంది? 'యూనిటీ' ఉన్నప్పుడే 'ప్యూరిటీ' వస్తుంది. 'ప్యూరిటీ' ఉన్నప్పుడే 'డివినిటీ' వస్తుంది. కాబట్టి, 'యూనిటీ', 'ప్యూరిటీ', 'డివినిటీ' – ఈ మూడింటినీ మీరు పెంచుకోండి. మీరందరూ చేరవచ్చు, ఇట్లాంటి త్యాగములో అందరూ కలసి పనిచేయవచ్చు. కాని, ఈవిధంగా వేర్వేరు ప్రాంతాలకు చెందిన పిల్లలు చేరితే పల్లెలకు కలిగే ఉపయోగమేమీ లేదు. దానివల్ల అంతా 'పొల్యూషన్' అయిపోతుందిగాని, 'ప్యూరిటీ' రాదు. వారి భావము ఒకటి, వీరి భావము ఒకటి... ఈవిధంగా భావాలు వేర్వేరు అయిపోయి మాలిన్యంగా మారిపోతాయి. ఇది కేవలం ఒక 'బిజినెస్ సెంటర్'గా మారిపోతుంది. ఆధ్యాత్మికము 'బిజినెస్ సెంటర్' కాదు. ఆధ్యాత్మికము ఏకత్వముతోకూడిన దివ్యమైన భవనము. అనేకత్వములోని ఏకత్వమే ఈ ఆనందము. దీనిని మీరు పెంచుకోవాలని నేను ఆశిస్తున్నాను. అప్పుడే మీ సేవకు తగిన విలువ వస్తుంది.

ఒక ఉదాహరణ చెబుతాను. భూమినుండి బంగారము పుట్టింది. దానిని పరిశుద్ధం చేసినప్పుడు అది అపరంజిగా రూపొందుతుంది. అపరంజిగా ఉన్నప్పుడు దాని విలువ

sri sathyasai vahini amrutam

అధికంగా ఉంటుంది; కాసుకు నాలుగు నూర్లు, ఐదు నూర్లు వస్తాయి. దానిలో రాగి, ఇత్తడి మొదలైన లోహాలను కలిపితే దాని వెల తగ్గిపోతుంది. అంతేకాదు, అది కాంతివిహీనమౌతుంది. ఇంకా కొన్ని లోహాలను కలిపితే కడకు బంగారానికి విలువే లేకుండాపోతుంది. మన హృదయమే ఒక Golden Temple. అది హిరణ్యగర్భము. ఆ హిరణ్యములో ఏమాత్రము మార్పు రాకూడదు. ఎప్పుడూ ప్రకాశిస్తూనే ఉంటుండాలి. ఆవిధంగా ఉంటేనే మంచిది. అంతేగాని, వారిది, వీరిది అంతా కలుపుకొని మాలిన్యము చేసుకో కూడదు. ప్రేమను పంచుకోండి. ఐకమత్యంతో పవిత్రంగా జీవించండి.

(తేది: 01.01.2003, సాయికుల్వంత్ సభామండపం)

sri sathyasai vachanamrutam